

బాక్సింగ్ పోటీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి

క్రీడల్లో గెలుపు ఓటములు సహజం: ఎమ్మెల్యే దేవిరెడ్డి

ఎల్‌బీనగర్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని వాటిని క్రీడాస్ఫూర్తితో తీసుకోవాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న ఎలైట్ ఉమెన్స్ నేషనల్ లెవల్ బాక్సింగ్ టోర్నమెంట్ 2025 పోటీలను ఆదివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహిస్తూ ప్రపంచ దేశాల క్రీడాకారుల కంటే ఉత్తమ ప్రతిభ కనబరిచేలా తయారు చేయాలన్నారు. కార్యక్రమంలో బాక్సింగ్ ఫెడరేషన్ ప్రతినిధులు రవీందర్, మన్మోహన్, సరూర్‌నగర్ స్టేడియం కోచ్ కుమార్, నిజాం కళాశాల మైదానం కోచ్ దుర్గాప్రసాద్, ఎల్బీనగర్ బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు రవిముదిరాజ్, చంద్రశేఖరరెడ్డి పాల్గొన్నారు.

రక్తదానంతో మరొకరికి ప్రాణదానం

మన్సూరాబాద్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): రక్తదానం చేయడం ద్వారా మరొకరి కి ప్రాణదానం చేసిన వారమవుతామని, ప్రతిఒక్కరూ విధిగా రక్తదానం చేయాలని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలోని శ్రీరాంహిల్స్‌కాలనీ కమ్యూనిటీ హాలులో ఆదివారం భీమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రారంభించడంతో పాటు రక్తదానం చేయడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించారు. కార్యక్రమంలో డివిజన్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి, కాలనీ అధ్యక్షకార్యదర్శులు, సభ్యులు, ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.



ప్రధాని మోదీ మన్‌కీ బాత్‌ను వీక్షిస్తున్న కార్పొరేటర్ అరుణాసురేందర్‌యాదవ్

ప్రధాని మన్ కీ బాత్ వీక్షణ

మన్సూరాబాద్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆదివారం నిర్వహించిన 'ప్రధాని మన్ కీ బాత్' కార్యక్రమాన్ని నాగోల్ కార్పొరేటర్ చింతల అరుణాసురేందర్‌యాదవ్ వీక్షించారు. కార్పొరేటర్ ఆధ్వర్యంలో తన నివాసంలో బీజేపీ డివిజన్ నాయకులతో వీక్షించిన ఆమె కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ పాలనలో దేశంలో జరుగుతున్న గుణాత్మక మార్పులను, అభివృద్ధిని పీఎం మోదీ వివరించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చింతల సురేందర్‌యాదవ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



కార్పొరేటర్‌కు వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

కాలనీవాసుల సమస్యలను పరిష్కరిస్తా: లచ్చిరెడ్డి


వనస్థలిపురం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కాలనీవాసులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ పద్మావతినగర్ కాలనీవాసులు ఆదివారం తమ కాలనీలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కార్పొరేటర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీవాసులకు అవసరమైన త్రీఫేస్ విద్యుత్ సదుపాయం, వీధి దీపాలు, నూతన ట్రాన్స్‌ఫార్మర్, రోడ్ల సౌకర్యాలను పరిష్కరిస్తానని తెలిపారు. కాలనీవాసులు పాల్గొన్నారు.



రథయాత్రలో ఇస్కాన్ ఆలయ ప్రతినిధులు, భక్తులు

ఘనంగా జగన్నాథ రథయాత్ర

సైదాబాద్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): అస్మాన్‌ఘడ్‌లో జగన్నాథ రథయాత్ర ఇస్కాన్ ఆలయ ప్రతినిధి లీలాసుఖ్‌దేవ్ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. భక్తులు జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్రలను రథంపై ఊరేగించారు. హరే కృష్ణ నామస్మరణలు, సంకీర్తన హోరు, భక్తుల కోలాహలం మధ్య భక్తి పారవశ్యంతో యాత్ర జరిగింది. ఈ యాత్ర అస్మాన్‌ఘడ్ నుంచి ప్రారంభమై ఎస్‌బీహెచ్ సీ కాలనీ విఘ్నేశ్వర హాల్ వరకు కొనసాగింది. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు హరిగౌడ్, ఇస్కాన్ ప్రతినిధి లెనిన్‌బాబు పాల్గొన్నారు.



ఆర్టీసీ ఫారూఖ్‌నగర్ డిపో కార్యవర్గాన్ని అభినందిస్తున్న అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు

ఫారూఖ్‌నగర్ డిపో అసోసియేషన్ అధ్యక్షుడిగా పెద్దయ్య

చాదర్‌ఘాట్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ చార్మినార్ డివిజన్ పరిధిలోని ఫారూఖ్‌నగర్ డిపో ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా పి. పెద్దయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆర్టీసీ ఎస్సీ, ఎస్టీ ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం శ్రీనివాస్, రాష్ట్ర చీఫ్ అడ్వైజర్ పి.సుభాష్, జోనల్ సెక్రటరీ కె.నిరంజన్, జోనల్ కోశాధికారి అరుణ, రీజినల్ కార్యదర్శి ఎం.శంకర్, వరలక్ష్మి, డివిజినల్ సెక్రటరీ సీహెచ్ రఘుపతి, వర్కింగ్ ప్రెసిడెంట్ నారాయణ నాయక్ సమక్షంలో అసోసియేషన్ డిపో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. డిపో వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గోపాల్‌నాయక్, కార్యదర్శిగా ఎస్‌టీనాయక్, కోశాధికారిగా విజయ్‌కుమార్, చీఫ్‌అడ్వైజర్‌గా సుధాకర్, లచ్చయ్యనాయక్ ఎన్నికయ్యారు.

'తెలంగాణ నాయర్ సొసైటీ ఏర్పాటు అభినందనీయం'

కాప్రా, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కులమతాలకతీతంగా, నిస్వార్థ సేవే లక్ష్యంగా తెలంగాణ నాయర్ సేవా సొసైటీని ఏర్పాటు చేయడం అభినందనీయమని గోవా గవర్నర్ పీఎస్. శ్రీధరన్ పిళ్లై అన్నారు. నూతనంగా ఏర్పాటైన తెలంగాణ నాయర్ సేవా సొసైటీని ఆదివారం కాప్రాలోని ఓ ఫంక్షన్ హాల్‌లో ఆయన వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలోని నాయర్లు సేవా సొసైటీని ఏర్పాటు చేసుకుని ఏకతాటిపైకి రావడం శుభ పరిణామమన్నారు. కేరళ నాయర్ సర్వీస్ సొసైటీ వ్యవస్థాపకుడు మన్నత్ పద్మనాభన్ ఆశయాలకనుగుణంగా తెలంగాణ నాయర్ సేవా సొసైటీ పనిచేయాలని, సంస్కృతి సంప్రదాయాలు ప్రతిబింబించేలా తెలంగాణలోని అన్ని వర్గాల వారికి సేవలందించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో తెలంగాణ నాయర్ సేవా సొసైటీ అధ్యక్షుడు కె.సురేంద్రన్, ఉపాధ్యక్షుడు పి.మోహన్, ప్రధాన కార్యదర్శి శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటితో ముగియనున్న 3నెలల రేషన్ పంపిణీ

పోర్టబిలిటీతో కలిసి 109 శాతం పంపిణీ

చాదర్‌ఘాట్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రభుత్వం రేషన్ కార్డులున్న లబ్ధిదారులకు ఒకేసారి మూడు నెలల రేషన్ పంపిణీ సోమవారంతో ముగియనుంది. పౌర సరఫరాల విభాగం ఒకటో సర్కిల్ పరిధిలో శనివారం నాటికి పోర్టబులిటీతో కలిపి 109 శాతం మేరకు రేషన్ పంపిణీ జరిగినట్లు సమాచారం. సర్కిల్-1 పరిధిలో 69షాపుల ద్వారా 69,267 రేషన్ కార్డులుండగా దాదాపు 2,77,028 రేషన్ లబ్ధిదారులకు జూన్ మాసంతో పాటు జూలై, ఆగస్టు నెలలకు కలిపి ఒకే మారు మూడు నెలల సన్న బియ్యం పంపిణీ చేశారు. ఒక్కో లబ్ధిదారుడికి ఆరు కిలోల చొప్పున మూడు నెలలకు కలిపి 18కిలోలుగా సన్న బియ్యం పంపిణీ చేశారు.



మలక్‌పేటలోని పౌర సరఫరాల విభాగం ఒకటో సర్కిల్ కార్యాలయం

సర్వర్ సమస్యలున్నా..

జూన్ ఒకటో తేదీ నుంచి ప్రారంభమైన మూడు నెలల సన్న బియ్యం పంపిణీకి సర్వర్ సమస్యలు అడ్డంకిగా మారాయి. దీనికి తోడుగా ఒక్కో లబ్ధిదారుడు మూడు నెలలకు సంబంధించి మూడు సార్లు వేలిముద్రలు వేయడం, వేలిముద్రలు పూర్తయిన తర్వాత రేషన్ డీలర్ మూడు నెలలకు సంబంధించిన వివరాలను పరిశీలించిన తర్వాతే సన్న బియ్యం పంపిణీ చేశారు. ఇలా ఒక్కో లబ్ధిదారుడికి కనీసం 10 నుంచి 15 నిమిషాల సమయం పట్టింది. ఉదయం నుంచే రేషన్ షాపుల ముందు లబ్ధిదారులు బారులు తీరారు. ఈనెల 25 వరకు రేషన్ షాపుల ముందు రేషన్ కార్డుదారులు బారులు తీరే సమస్య దాదాపుగా తగ్గిపోయింది.

సర్కిల్-1లో 109శాతం సన్న బియ్యం పంపిణీ

పౌర సరఫరాల విభాగం ఒకటో సర్కిల్ పరిధిలో జూన్ మాసంలో మూడు నెలల సన్న బియ్యం పంపిణీ దాదాపుగా పూర్తయింది. సర్కిల్-1 పరిధిలోని రేషన్ లబ్ధిదారులతో పాటు పోర్టబిలిటీతో కలిపి 109 శాతం వరకు సన్న బియ్యం పంపిణీ జరిగింది. - **నర్సింగ్‌రాజ్, ఏఎస్‌వో, పౌర సరఫరాల విభాగం ఒకటో సర్కిల్**

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

సైదాబాద్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): టీజీఎస్‌పీడీసీఎల్ అస్మాన్‌ఘడ్ డివిజన్ పరిధిలోని మరమ్మతు పనుల కారణంగా సోమవారం 11కేవీ పూర్ణోదయకాలనీ ఫీడర్ పరిధిలోని పరిసర ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు, శాలివాహననగర్ ఫీడర్ పరిధిలోని పరిసర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30నుంచి సాయంత్రం 5.30గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని డీఈ విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు.



నిజామాబాద్‌లో జాతీయ పసుపు బోర్డు ప్రారంభోత్సవానికి ఎయిర్‌పోర్టుకు చేరుకున్న కేంద్ర హోంమంత్రి అమిత్‌షాకు స్వాగతం పలుకుతున్న బీజేపీ భాగ్యనగర్ జిల్లా మాజీ అధ్యక్షుడు సంరెడ్డి సురేందర్ రెడ్డి తదితరులు. - సైదాబాద్, ఆంధ్రజ్యోతి

రాష్ట్రంలో ప్లానింగ్ లేని అస్తవ్యస్త పాలన

- కాంగ్రెస్ కండువా ఉంటేనే ఇందిరమ్మ ఇళ్లు
- మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి ధ్వజం

సరూర్‌నగర్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ప్లానింగ్‌లేని పాలన నడుస్తోందని, కాంగ్రెస్ కండువా కప్పుకుంటేనే ఇందిరమ్మ ఇళ్లు వచ్చే దుస్థితి నెలకొన్నదని ఎమ్మెల్యే పి.సబితారెడ్డి ధ్వజమెత్తారు. ఒక కాలనీని ఎంత ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేస్తామో రాష్ట్రాన్ని సైతం అదే తరహాలో అభివృద్ధి చేయాల్సి ఉంటుందని, కానీ ప్రస్తుతం రాష్ట్రంలో తలాతోకాలేని పాలన కొనసాగుతున్నదని ఆమె ఎద్దేవా చేశారు. ఆదివారం బడంగ్‌పేట్ కార్పొరేషన్ నాదర్‌గుల్ 31వ డివిజన్‌లోని గ్రీన్‌రిచ్‌కాలనీలో ఎమ్మెల్యే పర్యటించి స్థానికుల సమస్యలు తెలుసుకున్నారు. అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం కాలనీవాసులు ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రజా సంక్షేమం కన్నా రాజకీయమే ప్రధానంగా మారిందని, ప్రతిపక్ష ఎమ్మెల్యేలు ఉన్న నియోజకవర్గాల్లో అధికారులను భయభ్రాంతులకు గురిచేస్తూ పనులు జరగకుండా అడ్డుకుంటున్నారని ఆరోపించారు. అధికార పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు అభివృద్ధిపై దృష్టి పెట్టాలని, అధికారులను వేధించడం మంచి పద్ధతి కాదని ఆమె హితవు పలికారు. ప్రజలు ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, ప్రభుత్వంతో కొట్లాడైనా సరే నిధులు తీసుకువచ్చి పనులు చేయిస్తానని ఆమె స్పష్టం చేశారు. కార్యక్రమంలో కౌన్సిల్ బీఆర్ఎస్ మాజీ ఫ్లోర్ లీడర్ సూర్లగంటి అర్జున్, మాజీ కార్పొరేటర్లు పెద్దబావి శోభాఆనంద్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లిక్కి మమతాకృష్ణారెడ్డి, బోయపల్లి దీపికాశేఖర్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్‌రాజు, కర్రె బల్వంత్, నరేశ్, సాయి పాల్గొన్నారు.



బడంగ్‌పేట్‌లో మాట్లాడుతున్న సబితారెడ్డి

రిటైర్డ్ ప్రొఫెసర్ మూర్తికి ఎమినెంట్ ఇంజనీర్ అవార్డు

సరూర్‌నగర్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్‌జీఎస్ మూర్తిని జాతీయ స్థాయి 'ఎమినెంట్ ఇంజనీర్' అవార్డు వరించింది. సివిల్ ఇంజనీరింగ్ రంగంలో ఆయన చేసిన సేవలు, పలు ప్రాజెక్టులలో ఆయన భాగస్వామ్యానికి గుర్తింపుగా 'అసోసియేషన్ ఆఫ్ కన్సల్టింగ్ సివిల్ ఇంజనీర్స్ ఇండియా'(ఏసీసీఈఐ) తెలంగాణ నుంచి ఆయనను ఈ అవార్డుకు ఎంపిక చేసింది. ఏసీసీఈఐ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా శనివారం పాండిచ్చేరిలో నిర్వహించిన కార్యక్రమంలో మూర్తికి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్.రంగస్వామి ఎమినెంట్ ఇంజనీర్ జాతీయ అవార్డును అందజేశారు. తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రాజెక్టులకు మూర్తి కన్సల్టెంట్‌గా వ్యవహరించారు. చర్లపల్లి రైల్వేస్టేషన్ విస్తరణ, ఎస్ఆర్‌డీపీ, ఎస్ఎన్‌డీపీ, సీఆర్ఎంపీ వంటి ప్రభుత్వ ప్రాజెక్టులతో పాటు హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుకు కూడా ఆయన కన్సల్టెంట్‌గా వ్యవహరించారు. దాదాపు నాలుగు దశాబ్దాలుగా ఆయన కన్సల్టింగ్ స్ట్రక్చరల్ సివిల్ ఇంజనీర్‌గా కొనసాగుతున్నారు. గతంలో బాలాపూర్ మండలం బడంగ్‌పేట్ కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్‌లో గల ఎంవీఎస్ఆర్ ఇంజనీరింగ్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్‌గా ఆయన పని చేశారు. ఇటీవల పదవీ విరమణ చేసిన మూర్తి తన ఫీల్డ్‌ను వదిలిపెట్టకుండా సివిల్ ఇంజనీరింగ్‌లో తన సేవలను కొనసాగిస్తున్నారు. కాగా తనకు జాతీయ స్థాయిలో అవార్డు రావడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. అవార్డుతో తన బాధ్యత మరింత పెరిగిందని, ప్రభుత్వ, ప్రైవేటు ప్రాజెక్టులకు తన సేవలను కొనసాగిస్తానని ఆయన పేర్కొన్నారు.



పాండిచ్చేరి సీఎం రంగస్వామి చేతుల మీదుగా ఎమినెంట్ ఇంజనీర్ అవార్డు అందుకుంటున్న మూర్తి

మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పురుషోత్తంరావుపటేల్

చాదర్‌ఘాట్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా రంగారెడ్డి జిల్లాకు చెందిన సర్దార్ పుట్టం పురుషోత్తం పటేల్ 630 ఓట్లతో ఘన విజయం సాధించారు. తన సమీప ప్రత్యర్థి నల్గొండ జిల్లాకు చెందిన వాసాల వెంకటేశ్వర్లుపటేల్ పై 716 ఓట్లకు 630 ఓట్ల ఆధిక్యతను సాధించారు. ఆదివారం నగరంలోని జలవిహార్‌లో జరిగిన తెలంగాణ మున్నూరు కాపు సంఘం రాష్ట్ర కమిటీ ఎన్నికల్లో పోటాపోటీగా సాగాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మున్నూరుకాపు సంఘం ఓటర్లు తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకున్నారు. అదేవిధంగా సంఘం ప్రధాన కార్యదర్శిగా మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన పెద్ది పెంటయ్య తన సమీప ప్రత్యర్థి మున్నూరు జైపాల్ పటేల్‌పై 716 ఓట్లకు గాను 402 ఓట్ల ఆధిక్యతను సాధించి విజయం సాధించారు.

ఘన విజయం సాధించిన పుట్టం పురుషోత్తం పటేల్‌ను దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్ మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు అనంతుల నవీన్, వర్కింగ్ ప్రెసిడెంట్ తోట రాజు పటేల్, ప్రధాన కార్యదర్శి చక్రం నాగరాజు పటేల్ సలహాదారుడు పులిపాటి త్రివేదితో కూడిన కార్యవర్గసభ్యులు ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



పురుషోత్తంరావు పటేల్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఎల్బీనగర్ మున్నూరుకాపు సంఘం అధ్యక్షుడు నవీన్ పటేల్, వర్కింగ్ ప్రెసిడెంట్ రాజు పటేల్

మహిళ ఆత్మహత్య

అల్వాల్ : కుటుంబ కలహాల కారణంగా ఓ మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం అల్వాల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల ప్రకారం.. అల్వాల్ హరిజన బస్తీ ప్రాంతానికి చెందిన చిన్న నరసింహ, రాధ (38) భార్యభర్తలు వీరికి ఇద్దరు సంతానం ఉన్నారు. చేపలను విక్రయిస్తూ జీవిస్తున్నారు. ఆదివారం రాధ ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. భర్త సక్రమంగా పనిచేయకపోవడం, చిన్నారుల పోషణ ఆమెపై పడింది. ఆర్థిక భారం, కుటుంబ కలహాల కారణంగా మనస్తాపానికి గురైన ఆత్మహత్యకు పాల్పడి ఉంటుందని ఆమె సోదరుడు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గౌరవ డాక్టరేట్ అందుకున్న యాదవరెడ్డికి సన్మానం

ఎల్‌బీనగర్, జూన్ 29 (ఆంధ్రజ్యోతి): ఏసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకు రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం గిరికొత్తపెల్లికి చెందిన సంఘసేవకుడు వంగూరి యాదవరెడ్డిని ఆదివారం టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి సత్కరించారు. నగరంలోని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీలోని ఎన్టీఆర్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో గౌరవ డాక్టరేట్ అందుకున్న యాదవరెడ్డిని ఆదివారం అల్కాపురిలో భాస్కర్‌రెడ్డి అభినందించారు. నేషనల్ హ్యూమన్ రైట్స్ కన్స్యూమర్ ఫోరం ద్వారా సామాజికసేవ, పార్కింగ్ నిబద్ధత, ఎంఆర్‌పీల అమలు వంటి వాటిపై ఆయన చేసిన కృషికి ఏసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెర్చ్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ అందించడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ నాయకుడు చిలుక ఉపేందర్‌రెడ్డి, కాంగ్రెస్ ఆర్‌కేపురం డివిజన్ అధ్యక్షుడు పున్న గణేష్‌నేత, వెంకటేష్‌గుప్తా, ఆలయ కమిటీ చైర్మన్లురమేష్, సురేష్, రామకృష్ణ గౌడ్, లింగస్వామిగౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



గౌరవ డాక్టరేట్ అందుకున్న యాదవరెడ్డిని సత్కరిస్తున్న టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్‌రెడ్డి

అర్ధరాత్రి అకారణంగా రోడ్లపై తిరిగితే కేసులు తప్పవు

- మీర్‌పేట్ ఎస్‌హెచ్‌వో నాగరాజు హెచ్చరిక
- శనివారం రాత్రి 'ఆపరేషన్ చబుత్రా'

సరూర్‌నగర్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): అర్ధరాత్రి అకారణంగా రోడ్లపై తిరుగుతూ న్యూసెన్స్ చేసే వారిపై కేసులు తప్పవని మీర్‌పేట్ ఎస్‌హెచ్‌వో కె.నాగరాజు హెచ్చరించారు. 'ఆపరేషన్ చబుత్రా'లో భాగంగా శనివారం అర్ధరాత్రి దాటింతర్వాత మీర్‌పేట్ పీఎస్ పరిధిలోని టీకేఆర్ కమాన్, ఆర్ఎన్‌రెడ్డినగర్, జడ్పీ రోడ్డు కూడలి, నందనవనం, భూపేశ్‌గుప్తానగర్ తదితర ప్రాంతాల్లోని రోడ్లపై పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. ఇందులో భాగంగా దాదాపు 150 మందిని అదుపులోకి తీసుకుని నందనవనం సమీపంలోని మైదానానికి తరలించారు. అక్కడ వారికి ఇన్‌స్పెక్టర్ నాగరాజు కౌన్సెలింగ్ ఇచ్చారు. బర్త్‌డే వేడుకలు, ఇతరత్రా సంబరాల పేరుతో అర్ధరాత్రి వాహనాలతో రోడ్లపై తిరగొద్దని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. అలాంటి కార్యక్రమాలను ఇళ్లలో గానీ, ఇతర అనువైన స్థలాల్లోగానీ నిర్వహించుకోవాలని, అనవసరంగా రోడ్ల మీదకు వచ్చి హంగామా చేస్తే కేసుల్లో చిక్కుకుని జైలుకు వెళ్లాల్సి వస్తుందని ఆయన పేర్కొన్నారు. రాత్రి పూట బాక్స్ క్రికెట్ సైతం ఆడొద్దని, సదరు గ్రౌండ్‌ల నిర్వాహకులు కూడా సమయపాలన పాటించాలని ఆయన సూచించారు. మద్యం తాగి రోడ్లపై న్యూసెన్స్ చేయొద్దని ఆయన హితవు పలికారు. ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు ఉంటాయని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో డీఐ గౌరునాయుడు, ఎస్ఐలు, ఏఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.



రోడ్లపై తిరుగుతున్న యువకులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ఇన్‌స్పెక్టర్ నాగరాజు



ఎన్నికైన ఎఫ్‌సీఐకాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు

ఎఫ్‌సీఐ కాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఆది నరసింహారావు

వనస్థలిపురం, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఎఫ్‌సీఐకాలనీ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా ఆది నరసింహారావు ఎన్నికయ్యారు. ఆదివారం అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో ఈ మేరకు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షుడిగా ఈరటి రాజుయాదవ్, ప్రధాన కార్యదర్శిగా సలుకూటి చంద్రశేఖరరెడ్డి, సంయుక్త కార్యదర్శిగా పల్లే వాణి, విత్తీయ కార్యదర్శిగా వడ్డేపల్లి సత్యనారాయణ ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా జక్క అనురాధరెడ్డి, గజ్జెల ఝాన్సీరెడ్డి, కందాళ యాదిరెడ్డి, కస్తూరి మురళీకృష్ణ, మల్లబోయిని మాల్యాద్రి, భట్టార్ రాఘవచారి ఎన్నికైన వారిలో ఉన్నారు.



శేషాద్రినగర్‌లో పర్యటిస్తున్న మాజీ వైస్ చైర్మన్ నర్సింహారెడ్డి, రాఘవేందర్‌రెడ్డి

ప్రజా సమస్యలను పరిష్కరిస్తాం : నర్సింహారెడ్డి

సరూర్‌నగర్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): కాలనీల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామని బడంగ్‌పేట్ మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ చిగిరింత నర్సింహారెడ్డి అన్నారు. ఆదివా రం ఆయన యూత్ కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గ మాజీ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డితో కలిసి బడంగ్‌పేట్ కార్పొరేషన్ 4వ డివిజన్‌లోని శేషాద్రినగర్‌కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు తాము ఎదుర్కొంటున్న పలు సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చారు. కాలనీలోని అంతర్గత రోడ్లను అభివృద్ధి చేయాలని, పూర్తిస్థాయిలో డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచాలని, అవసరమైన చోట వీధి దీపాలు ఏర్పాటు చేయించాలని, రోజు విడిచి రోజు కృష్ణానీరు సరఫరా అయ్యేలా చూడాలని కాలనీవాసులు వారిని కోరారు. అనంతరం నర్సింహారెడ్డి మాట్లాడుతూ ఆయా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

సేవాదళ్ ఆధ్వర్యంలో జాతీయ పతాక ఆవిష్కరణ



ఎల్బీనగర్‌లో జాతీయ పతాకం ఎగురవేస్తున్న సేవాదళ్ అధ్యక్షుడు జితేందర్

చంపాపేట, జూన్ 29(ఆంధ్రజ్యోతి): అఖిలభారత కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో ఆదివారం ఎల్బీనగర్‌లో నిర్వహించిన కార్యక్రమానికి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేశారు. దేశ వ్యాప్తంగా ప్రతి నెల చివరి ఆదివారం సేవాదళ్ ఆధ్వర్యంలో జాతీయ పతాకం ఎగురవేయడం ఆనవాయితీగా వస్తుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గాంధీభవన్ ఇన్‌చార్జి బండి సురేందర్, రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు రమాకాంత్, నియోజకవర్గ అధ్యక్షుడు అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆర్టీసీ కండక్టర్ ఆత్మహత్యాయత్నం

చాదర్‌ఘాట్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ దిల్‌సుఖ్‌నగర్ డిపోలో పని చేస్తున్న మహిళా కండక్టర్ ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. చైతన్యపురి నివాసి సంధ్య ఆర్టీసీ దిల్‌సుఖ్‌నగర్ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తుంది. విధి నిర్వహణలో భాగంగా ఆదివారం ఉదయం విధులకు హాజరైన కండక్టర్ అంటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం చేసింది. ఇక తనకు కేటాయించిన రూట్ బస్సు ఎక్కాల్సి ఉంది. ఇంతలో ఆమె డిపోలో కంట్రోలర్ గది పక్కన పురుగుల మందు తాగి అక్కడే కూర్చుండిపోయింది. అపస్మారక స్థితికి చేరుతున్న కండక్టర్‌ను గమనించిన తోటి ఉద్యోగులు వెంటనే గాంధీ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి మెరుగ్గా ఉందని వైద్యులు తెలిపినట్లు తోటి ఉద్యోగులు తెలిపారు. కుటుంబ కలహాల కారణంగా ఆత్మహత్యాయత్నానికి పాల్పడినట్లు మలక్‌పేట పోలీసులు జరిపిన విచారణలో వెల్లడైంది. అయితే తనకు ఎవరిపై ఎలాంటి అనుమానాలు లేవని, తాను ఫిర్యాదు చేయదలచుకోలేదని పేర్కొంటు మలక్‌పేట పోలీసులకు ఆమె రాతపూర్వకంగా తెలియజేయడంతో పోలీసులు కేసు నమోదు చేయలేదు.

నిషేధిత సిగరెట్లు విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

- రూ.10లక్షల విలువైన సొత్తు స్వాధీనం

చాదర్‌ఘాట్, జూన్ 29(ఆంధ్రజ్యోతి): నిషేధిత విదేశీ సిగరెట్లను సౌత్ ఈస్ట్ టాస్క్‌ఫోర్స్ టీమ్, చాదర్‌ఘాట్ పోలీసులు సంయుక్తంగా దాడిచేసి పట్టుకున్నారు. ఫైజల్ అనే వ్యక్తి అనుమతి లేకుండా విదేశాల నుంచి తక్కువ ధరకు ఢిల్లీ మీదుగా హైదరాబాద్‌కు ప్రైవేట్ ట్రాన్స్‌పోర్టు ద్వారా దిగుమతి చేసుకుంటున్నాడు. అక్బర్‌బాగ్‌లోని గోదాంలో వాటిని భద్రపరిచాడు. విదేశీ సిగరెట్లను పాన్‌షాపులు, కిరాణాషాపులకు ఎక్కువ ధరకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నాడు. ఈ మేరకు విశ్వసనీయ సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు. చాదర్ ఘాట్ పోలీసులతో కలిసి గోదాంపై దాడులు చేశారు. రూ. 10 లక్షల విలువచేసే వివిధ బ్రాండ్లకు చెందిన సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. అక్బర్‌బాగ్‌కు చెందిన ఫైజల్‌ను అరెస్ట్ చేశారు. ఈజీగా డబ్బులు సంపాదించడానికి విదేశీ సిగరెట్లు దిగుమతి చేసుకొని విక్రయిస్తున్నాడు. ఎలాంటి ట్యాక్స్ చెల్లించకుండా కొనుగోలు చేస్తున్నాడు. తదుపరి దర్యాప్తు కోసం కేసును చాదర్‌ఘాట్ పోలీసులకు అప్పగించారు. కేసును పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.